

నేత్రపర్వం 8లో

ములకలాపల్లి మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో గల వ్యూహ లక్ష్మీ సమేత శ్రీనివాసుడి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.



రచ్చబండ

మంచే సేసేడు.. మళ్లీ గెలుత్తాడు..! 10లో

గరిష్టం/కనిష్టం 39.3/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వడగాడ్పులు ఒకటి, రెండు చోట్ల వీచే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

నిజం చెప్పాలి

నాయకుడంటే విశ్వాసం. ఆయన మాట అంటే ఓ భరోసా. చెప్పాడంటే చేస్తాడన్న నమ్మకం. ఆ భావన కలిగించలేనివాడు నాయకుడే కాదు. ఆ ధైర్యం ఇవ్వలేని వాడు రక్షకుడే కాదు. ప్రాణం పోయినా నిజం చెప్పే నైజమే.. ఆ నిజాయితీయే విశ్వసనీయతకు తొలిమెట్టు. చెప్పింది చేయాలి.. చేసేదే చెప్పాలన్న నియమం నాయకుడిని ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. చెప్పిన వాడు చేస్తాడో లేదోనన్న సందేహం కలిగితే ఆ రోజుతో ఆయన వ్యక్తిత్వం సమాధి అయినట్టే. –నక్కపల్లి

నిలువెల్లా మోసం



నేను వ్యవసాయ పెట్టుబడుల కోసం నక్కపల్లి పీఏసీఎస్, ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకుల్లో 2013లో రెండు లక్షలు వ్యవసాయ రుణం తీసుకున్నాను. ఆనాటి నుంచి వాయిదాలు సక్రమంగా చెల్లించాను. వడ్డీతో కలిపి సుమారు రూ.50 వేలు బాకీ తీర్చాను. 2014లో ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు రైతులకు రుణమాఫీ ప్రకటించారు. చంద్రబాబు ప్రకటన చేసే నాటికి నా అప్పు వడ్డీతో కలిసి రూ.1.49 లక్షలు ఉంది. ఐదు వాయిదాల్లో మీ బాకీ మొత్తం ప్రభుత్వమే తీర్చేస్తుందని చెప్పడంతో చంద్రబాబునాయుడు మాయమాటలు నమ్మి బాకీ కట్టడం మానేశాను. నక్కపల్లి ఐవోబీలో తీసుకున్న అప్పుకు రూ.5,738లు ఒకసారి, రూ.9,549లు మరోసారి, పీఏసీఎస్‌లో తీసుకున్న అప్పుకు రూ.8,426లు ఒకసారి, రూ.8,701లు మరోసారి వెరశి రెండు బ్యాంకులకు కలిపి రూ.32,416లు ప్రభుత్వం జమ చేసింది. మిగిలిన రూ.1,17,583లు బాకీ కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొంటూ బాండు నా చేతిలో పెట్టారు. తర్వాత అంతే సంగతులు. మిగిలిన బాకీ నిమిత్తం చంద్రబాబు ఐదేళ్లలో ఒక్క పైసా కూడా చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు మాపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 32 వేలు ఇప్పటి వరకు అయిన వడ్డీకే సరిపోయిందని చెప్పడంతో గత్యంతరం లేక ఈ ఐదేళ్ల దఫదఫాలుగా నా బాకీ నేనే తీర్చుకోవాల్సి వచ్చింది. రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మమ్మల్ని మోసం చేయడంతో నా బాకీకి మరో 50 వేలు వడ్డీ కలిపి తీర్చుకోవాల్సి వచ్చింది. చంద్రబాబు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల వారు ఇళ్లకు వచ్చి జప్తు చేస్తామంటూ నోటీసులు ఇవ్వడం, నానా రాద్ధాంతం చేయడం వల్ల పరపతి పోగొట్టుకోవాల్సి వచ్చింది.

–వెదుళ్ల వెంకటరమణ, వెదుళ్లపాలెం, నక్కపల్లి మండలం

చంద్రబాబును ఎలా నమ్మాలి?



నేను ఐటీఐతోపాటు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పదేళ్ల కిత్రమే పూర్తి చేశాను. ఉద్యోగాలు కల్పిస్తానని, లేదంటే నిరుద్యోగులకు భృతి ఇస్తానని 2014లో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చాడు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కపైసా ఇవ్వలేదు. బతకడానికి టైలరింగ్ నేర్చుకున్నాను. అదే వృత్తిని కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తాడు. మళ్లీ చంద్రబాబును ఎలా నమ్మాలి? జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. టైలర్లకు ఇచ్చే పదివేల రూపాయల ఆర్థిక సాయం కూడా అందజేశారు. హామీ ఇచ్చాడంటే నెరవేర్చే సత్తా జగనన్నకే ఉంది.

–ఇసంపల్లి తిరుపతిరావు, దేవవరం, నక్కపల్లి మండలం

పేటలో సమరోత్సాహం



- నేటి మధ్యాహ్నం 1.10 గంటలకు సూర్యమహల్ జంక్షన్‌లో బహిరంగ సభ
- సభా ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి, తలశిల రఘురాం
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన పోలీసులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం

సాక్షి, అనకాపల్లి : ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మే నెల 1వ తేదీన బుధవారం పాయకరావుపేటకు వస్తున్నారు. పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్‌లో నిర్వహించే బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. జిల్లాలో చోడవరం బహిరంగ సభ సూపర్ సక్సెస్ అవ్వడంతో అదే రీతిలో పాయకరావుపేటలో కూడా మరింత విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

రెండు సభలు సూపర్ సక్సెస్

ఈనెల 19న ప్రారంభమైన మేమంతా బస్సు యాత్ర పాయకరావుపేట మీదుగా రెండు రోజుల పాటు జరిగింది. బస్సుయాత్ర విజయవంతం కావడం, అప్పుడే కోటకోట మండలం చింతలపాలెంలో బహిరంగ సభకు వేలాది మంది జన సందోహంతో సూపర్ సక్సెస్ అవ్వడం, అలాగే మలివిడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 29న చోడవరంలో బహిరంగ సభ మరింత విజయవంతం కావడంతో.. పాయకరావుపేట బహిరంగ సభను అదేతరహాలో సూపర్ సక్సెస్ చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు.

సభా ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి

వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఉన్నారు.

సీఎం పర్యటన ఇలా..

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా 9.20 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 9.30 గంటలకు విమానంలో బయలుదేరి 10.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లా బొబ్బిలికి చేరుకుని..అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు పాయకరావుపేటలో మంగవరం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గాన బయలుదేరి 1.10 గంటలకు పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ బహిరంగ సభ జరుగుతుంది. అనంతరం 2.15 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని, 2.25 గంటలకు హెలికాప్టర్‌లో ఏలూరు వెళతారు.

కట్టుదిట్టమైన భద్రత..

సీఎం పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మురళీ కృష్ణ, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ మంగళవారం పరిశీలించారు. సీఎం భద్రతా సిబ్బంది, స్థానిక పోలీస్ యంత్రాంగంతో కలిసి హెలిప్యాడ్ స్థలాన్ని, బహిరంగ సభ జరిగే సూర్యామహల్ సెంటరును పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు తదితర విషయాలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులను ఇప్పటి నుంచే పోలీసులు తమ అధీనంలోకి తెచ్చుకునే చర్యలు ప్రారంభించారు. ట్రాఫిక్ నియమాలపై కూడా పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.

సంక్షేమ ఫలాలు శాశ్వతమయ్యేలా.

- ప్రజలు ఆశీర్వదించాలి
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి

నక్కపల్లి/పాయకరావుపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలు శాశ్వతం కావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే అఖండ మెజారిటీతో ఎక్కువ సీట్లతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పాయకరావుపేటలో బుధవారం జరగనున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను ఆయన మంగళవారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేయగలిగినవే మేనిఫెస్టోలో చెప్పడం జరిగిందని, చంద్రబాబులా మాయలు చేసే నైజం తమది కాదన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరో ఐదేళ్లు కొనసాగించే అవకాశం ఇవ్వాలని కోరడానికే జగనన్న వస్తున్నారన్నారు. సభకు వచ్చే అభిమానులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక నేతలకు సూచించారు. ఎంపీ గొల్ల బాబూరావు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబీ, సీనియర్ నాయకులు దత్తుడు సీతబాబు, బొలిశెట్టి గోవిందు, జగతా శ్రీను ఆయన వెంట ఉన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు వార్ రూమ్



రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

విశాఖ సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలో ఎన్నికల సూచనలు, సలహాల కోసం ఆయా పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రత్యేక వార్ రూమ్ (సమాచార కేంద్రం) ఏర్పాటు చేసినట్లు రాజ్యసభ సభ్యుడు, ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఎండాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను ఓటర్లు, పార్టీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనకాపల్లి నియోజకవర్గ పార్లమెంట్ పరిధిలోని వారు 8019622677 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్

అనకాపల్లి: జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ (కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ) ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి ఈ నెల 4వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ప్రథమ, ఆ తర్వాత 2 నుంచి 5 గంటల వరకూ ద్వితీయ విద్యార్థులకు అనకాపల్లి గవరపాలెం ఉమెన్స్, సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ ఒకేషనల్ విద్యార్థులకు నర్సీపట్నం బాలుర జూనియర్ కళాశాలలోనూ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

24 నుంచి ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియట్ పరీక్షలు

ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో పరీక్షలు తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. 24న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మొదటి సంవత్సరం పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

దేవరాపల్లిలో టీడీపీకి గట్టి షాక్



దేవరాపల్లి నుంచి పార్టీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- 25 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : దేవరాపల్లిలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. టీడీపీలో గట్టి పట్టున్న 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. తారువలో మంగళవారం అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వారందరికీ పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవలతో తరిస్తూ, దేవరాపల్లిని చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దిన బూడి ముత్యాలనాయుడు నాయకత్వంపై ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని వారంతా స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో గుల్లేపల్లి వెంకట సన్యాసినాయుడు, చిటికిరెడ్డి రమణమ్మ, చిటికిరెడ్డి అప్పారావు, చిటికిరెడ్డి ఈశ్వరరావు, చిటికిరెడ్డి శ్రీను, చిటికిరెడ్డి నాయుడు, కొరుపోలు నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు. ఎంపీగా ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా ఈర్లి అనురాధను గెలిపించేందుకు కష్టపడి పనిచేస్తామని డిప్యూటీ సీఎం బూడికి తెలియజేశారు. కార్యక్రమంలో ఈరిబిల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

హ్యాపీ..హ్యాపీ



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ అగ్రతాంబూలం

- ప్రభుత్వంలో సామాజిక న్యాయం
- దళిత, వెనుకబడిన వర్గాలకు జగన్ పట్టం
- మంత్రుల నుంచి ఆలయ కమిటీల వరకు అన్నింటా ప్రతినిథ్యం
- అణగారిన వర్గాలకు 70 శాతానికి పైగా పదవులు కల్పించిన సీఎం జగన్

విశాఖ సిటీ: ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని చంద్రబాబు వారిపై అక్కసు వెళ్లగక్కితే.. సీఎం జగన్ వారికి రాజకీయ పదవులు ఇచ్చి అక్కున చేర్చుకున్నారు. బర్రెలు, గొర్రెలు కాసుకొనే వారికి రాజకీయాలు ఎందుకని చంద్రబాబు వెనుకబడిన వర్గాలను అవమానిస్తే.. జగన్ వారికి ప్రభుత్వంలో ప్రతినిథ్యం కల్పించారు. జాత్యహంకారంతో బడుగు, బలహీన వర్గాల వారిని చంద్రబాబు చిన్నచూపు చూడగా.. జగన్ వారికి సంపూర్ణ రాజ్యాధికారం కల్పించి పట్టం కట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూడగా.. మొట్టమొదటి సారిగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించింది. మంత్రి పదవుల నుంచి ఆలయ కమిటీల వరకు అన్నింట్లోను 70 శాతం పదవులు కట్టబెట్టింది. రాష్ట్రంలోనే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో సైతం అణగారిన వర్గాల వారికి రాజకీయంగా ఉన్నత పదవులు అందించి సమున్నత స్థానంలో కూర్చోబెట్టింది.

రాజకీయంగా.. ఆర్థికంగా..

నా ఎస్సీ.. నా ఎస్టీ.. నా బీసీ.. నా మైనార్టీ.. ఇదీ ప్రతి ప్రసంగంలోను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న నినాదం.. కేవలం మాటలకే పరిమితమవలేదు. వారందరికీ రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారు. చంద్రబాబు అక్కసు వెళ్లగక్కిన బడుగు, బలహీన వర్గాలను జగన్ గుండెల్లో పెట్టుకున్నారు. ఒకవైపు పేద, సామాన్యులకు సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత అందిస్తూనే.. మరోవైపు వారిలో కొందరికి రాజకీయంగా పదవులు అందించి సామాజిక న్యాయం దిశగా అడుగులు వేస్తున్నారు.

చంద్రబాబు కుటిల ప్రయత్నాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్లబొల్లి మాటలు చెప్పి తమవైపునకు తిప్పుకోడానికి తెలుగుదేశం పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటి వరకు చంద్రబాబు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి చేశారు. ఎప్పుడూ ఈ అణగారిన వర్గాలను పట్టించుకోని చంద్రబాబు ఈ సారి ఎన్నికల్లో సైతం వీరిని ఓటు బ్యాంకులుగా మార్చుకునే పన్నాగంలో నిమగ్నమయ్యారు. చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ జీవితంలో గుర్తుకురాని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై బూటకపు వరాలు కురిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవైపు మతతత్వ పార్టీలతో జతకట్టి.. మైనార్టీలు తమవైపే ఉన్నారంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన విధంగా బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేసిన జగన్.. వచ్చే ఎన్నికల్లో సైతం వారికి మరింత మేలు జరిగేలా దృష్టి పెట్టారు. వచ్చే ఎన్నికల్లో సైతం మెజార్టీ స్థానాలను వారికే కేటాయించారు. మరోసారి వారికి రాజ్యాధికారంలో భాగస్వాములను చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

జిల్లాలో 70 శాతానికి పైగా పదవులు

రాష్ట్రంలోనే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రతి నియోజకవర్గంలోను 70 శాతానికి పైగా పదవులు ఈ వర్గాలకు కేటాయించింది. సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ఈ విషయాన్ని సుస్పష్టమైంది. 2019 ఎన్నికల్లో సైతం 10 అసెంబ్లీ స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడును డిప్యూటీ సీఎంగా కూడా చేశారు. ప్రభుత్వంలోనే కాకుండా నామినేటెడ్ పదవుల్లో సైతం అణగారిన వర్గాలకే సీఎం జగన్ ప్రాధాన్యత కల్పించారు. ఆలయ, మార్కెటింగ్ కమిటీల్లో సైతం అత్యధిక పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంబా రవిబాబు, రెల్లి కమిషన్ చైర్మన్‌గా వడ్డాది మధుసూదనరావు, బీసీ వర్గానికి చెందిన మత్స్యకారుడు కోలా గురువులుకు మత్స్య కార్పొరేషన్ చైర్మన్‌గా, అనంతరం డీసీసీబీ చైర్‌పర్సన్‌తో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. అలాగే క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్‌గా జాన్ వెస్లీ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌గా పల్లా చినతల్లి, డీసీసీబీ చైర్‌పర్సన్‌గా చింతకాయల అనితకు అవకాశం కల్పించారు. అదే విధంగా గవర, యాత, నగరాలు, పట్నాయక్ ఇలా అనేక కార్పొరేషన్లకు చైర్మన్లుగా విశాఖకు చెందిన వారికే అవకాశం కల్పించారు. ఇటీవలే వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన సనపల చంద్రమౌళిని నియమించారు. అలాగే ఒక్కో నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన కార్పొరేషన్లకు సుమారు 70 మంది వరకు డైరెక్టర్లు ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వ, నామినేటెడ్ పదవులతో పాటు, పార్టీ బాధ్యతల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు సమున్నత స్థానం కల్పించారు.

గోవాడ రైతులకు చెరకు నగదు చెల్లింపులు

- మూడో విడతగా వారి ఖాతాల్లోకి రూ. 9.92 కోట్ల జమ
- ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెరకు నగదు చెల్లింపులు చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. మంగళవారం నుంచి మూడో విడతగా రూ.9.92 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్టు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు తెలిపారు. 2023-24 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే మొదటి విడతగా రూ. 8.75 కోట్లు, రెండో విడతగా రూ. 8.68 లక్షలు చెల్లించామన్నారు. తాజాగా మూడో విడతగా 9.92 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు చెరకు సరఫరా చేసిన రైతులకు ఈ చెల్లింపులు చేస్తున్నామన్నారు. మూడో విడతలో 39,691 టన్నులకు గాను టన్నుకు రూ.2500 చొప్పున రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది సీజన్‌లో 2 లక్షల టన్నుల లక్ష్యానికిగాను చెరకు లేకపోవడంతో లక్షా 70 వేల 601 టన్నులు మాత్రమే చెరకు క్రషింగ్ చేశామన్నారు. సరాసరి రికవరీ 9.02రాగా, లక్షా 46 వేల 309 క్వింటాళ్ల పంచదారను ఉత్పత్తి చేశామన్నారు. చెరకు సరఫరా చేయడంలో ఫ్యాక్టరీ సభ్యరైతులు మరింత చొరవ చూపి ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు. 2024-25 సీజన్‌లో కనీసం 3 లక్షల టన్నులైనా చెరకు సరఫరా అయ్యేలా సాగు పెంచాలన్నారు.

నేడు ఉమ్మడి విశాఖలో పవన్ పర్యటన


సాక్షి, విశాఖపట్నం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల పర్యటన చేయనున్నారు. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం, పెందుర్తి జంక్షన్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు.

జనసేనలో వర్గ పోరు

మునగపాక : జనసేన పార్టీలో ఆధిపత్య పోరు రోజురోజుకూ ముదిరిపోతోంది. బుధవారం అచ్యుతాపురంలో జరగనున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనలో భాగంగా మంగళవారం మునగపాక జనసేన కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతల కుమ్ములాటలు చూపరులను విస్మయానికి గురిచేశాయి. సమావేశంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పరశురామ్ వ్యవహార శైలిపై మండలంలోని వల్లపు ఆనందపురం నుంచి ఇటీవల పార్టీలో చేరిన అల్లవరపు రమణబాబు బాహాటంగా దండెత్తాడు. తమ గ్రామపరిధిలో నీ పెత్తనం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఒకరిపై ఒకరు దూషణలకు పాల్పడుతూ తోపులాటకు సైతం దిగారు. నీ వల్లనే పార్టీకి చెడ్డపేరు వస్తుందని, ఇలా అయితే పార్టీలో తాము ఇమడలేమంటూ రమణబాబు అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన ఇతర నేతలు ఇద్దరికీ సర్ది చెప్పారు.

అభ్యర్థులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎన్నికల నియమావళిపై అవగాహన తప్పనిసరి
- ఎన్నికల పరిశీలకుడు దల్జిత్ సింగ్ మంగత్



ఎన్నికల నిబంధనలపై సమీక్షిస్తున్న పరిశీలకులు దల్జిత్‌సింగ్ మంగత్, రాకేష్‌కుమార్

తుమ్మపాల: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సాధారణ పరిశీలకుడు దల్జిత్ సింగ్ మంగత్ అన్నారు. ఎంపీ స్థానం బరిలో ఉన్న అభ్యర్థులకు కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలను అనుసరించి స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. ఎవరిపైనా దుష్ప్రచారం చేయొద్దని, ప్రార్థనా స్థలాలు, మతపర ప్రదేశాలు ప్రచారానికి నిషిద్ధమని సూచించారు. ప్రచార వాహనాలు, సామగ్రి వంటి వాటికి ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. వ్యయ పరిశీలకుడు గోపాలస్వామి మాట్లాడుతూ అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించాలన్నారు. సదరు ఖాతా ద్వారా తమ ప్రచార వ్యయ, లావాదేవీలు నిర్వహించాలన్నారు. ఖర్చుకు సంబంధించి మూడు పర్యాయాలు తనిఖీలు ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయంలో అకౌంట్స్ అధికారికి వివరించాలన్నారు. రూ.10 వేల వరకు నగదు చెల్లింపులు, అంతకు మించితే బ్యాంకు చెక్, అకౌంట్ పే ద్వారా చేయాలన్నారు. అంతకుముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులందరికీ సమాన హక్కులు, బాధ్యతలు ఉంటాయని చెప్పారు. పోలీసు పరిశీలకుడు డాక్టర్ రాకేష్ కుమార్, అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కోరం లేక జెడ్పీ సమావేశం వాయిదా

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, వివిధ స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించారు. నిబంధనల ప్రకారం 90 రోజుల వ్యవధిలో సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించాలి. అందులో భాగంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండడం వల్ల దానికి లోబడి సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అయితే సభ్యులు అతితక్కువ మంది హాజరయ్యారు. దీంతో కోరం లేని కారణంగా సమావేశాలు వాయిదా వేసినట్టు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు.

ఉమ్మడి మేనిఫెస్టోలో మత్స్యకారులకు మొండిచేయి

- బీజేపీకి రాజీనామా చేసిన ఉత్తరాంధ్ర మత్స్యకార విభాగం ఇన్‌చార్జి
- వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన మోసా అప్పలరాజు

పాయకరావుపేట: ఉమ్మడి మేనిఫెస్టోలో మత్స్యకారులకు మొండిచేయి చూపారని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర మత్స్యకార విభాగం ఇన్‌చార్జి మోసా అప్పలరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన బీజేపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వెంకటనగరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోసా అప్పలరాజు మాట్లాడుతూ ప్రజలకు నమ్మకద్రోహం చేసే టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కారణంగానే తాను పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులు, కుటుంబాలతో వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. టీడీపీ వల్ల బీజేపీకి నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ రెండు పార్టీలు దొందూదొందే అన్నారు. రాష్ట్రాభివృద్ధి ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. మత్స్యకారులకు సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రి పదవులు ఇచ్చారన్నారు. వేట నిషేధ సమయంలో రూ.పది వేల చొప్పున భృతి ఇస్తున్నారన్నారు. అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు బూటకపు హామీలు ఇస్తున్నారని ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు.

ప్రచార పర్వం



చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. రావికమతంలో ఆయన నూడుల్స్ తయారు చేస్తూ స్థానికులతో మాట్లాడారు. తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

- రావికమతం



యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారంలో దూసుకుపోతున్నారు. మునగపాకలో విస్తృతంగా ప్రచారం చేశారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- మునగపాక

వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ సుడిగాలిలా పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి తనకు ఓటు వేయాలని కోరారు.

- నర్సీపట్నం





ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మాసాహేబుపేటలో ప్రచారం నిర్వహించి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- పాయకరావుపేట

మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎల్.బి. పట్నంలో వృద్ధులను ఆప్యాయంగా పలకరించి తనను ఆశీర్వదించవలసిందిగా కోరారు.

- చీడికాడ



జగనన్నను గెలిపించుకుంటేనే సంక్షేమం

- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి
- చీడికాడలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనూరాధతో ఎన్నికల ప్రచారం



శిరిజాంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కల్యాణి

చీడికాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. మంగళవారం ఆమె వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధతో కలిసి మండలంలోని జైతవరం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ గ్రామాన కోలాటాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పుల మధ్య మహిళలు హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. జైతవరం, బి.సింగవరం, ఎల్.బి.పట్నం, అప్పలరాజుపురం, ఖండివరం, కె.ఎల్.బి.పట్నం, వి.బి.పేట, గొప్పూరు, కొండేంపూడి, శిరిజాం, కోనాం, మంచాల, గదబూరు, చీడికాడ, తంగుడుబిల్లి, తురువోలు గ్రామాల్లో ప్రచారం కొనసాగింది. శిరిజాం సభలో కల్యాణి మాట్లాడుతూ చంద్రబాబు అలవికాని హామీలతో జనాలను మోసగించడానికి మరో కూటమి కట్టి వస్తున్నారని, ఎక్కడెక్కడి నుంచో వ్యక్తులను తెచ్చి మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల్లో పోటీలో ఉంచారని విమర్శించారు. ఎన్నికలు ముగియగానే టీడీపీ, బీజేపీ అభ్యర్థులు వారి సొంత ప్రాంతాలైన పెందుర్తి, కడప వెళ్లిపోతారన్నారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీలు లాలం శారదాజానకీరాం, కర్రి సత్యం, చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాబు మాటలు నమ్మి మోసపోవద్దు



ఏటికొప్పాకలో ప్రచారకార్యక్రమంలో మాట్లాడుతున్న కన్నబాబు



హాజరైన స్థానికులు

- ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు

యలమంచిలి రూరల్: చంద్రబాబు ఇచ్చే మోసపూరిత హామీలను ఎవరూ నమ్మకండి..ఆయన మాటలు కాగితాలకే పరిమితమని యలమంచిలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. యలమంచిలి మండలం ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో మంగళవారం రాత్రి ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబుకు స్థానికుల వద్ద నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం,అభివృద్ధి ఎక్కడా కనిపించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. మళ్లీ గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. తమ పార్టీ మేనిఫెస్టోలో కేవలం చేయగలిగే హామీలనే ఇచ్చామన్నారు. టీడీపీ,జనసేన, బీజేపీ పార్టీలు ప్రజలను మోసగించడానికి ఆచరణ సాధ్యంకాని హామీలను ఇస్తున్నాయని,ప్రజలు వారి మోసపూరిత హామీలను గమనించి తమకు పట్టం కట్టాలన్నారు.ఎంపీపీ బోదెపు గోవిందు,జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి,మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము,మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లి త్రినాథ్,పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు



యాగశాలలో బ్రహ్మోత్సవ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న వేద పండితులు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో గల వ్యూహ లక్ష్మీ సమేత శ్రీనివాసుడి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం యాగశాలలో ద్వార తోరణ,ధ్వజకుంభ ఆరాధన, చతుస్థానార్చన, మహాకుంభస్థాపన, అగ్ని ప్రతిష్ఠ,నవ కలశ స్నపన తిరుమంజనం, తీర్థ గోష్ఠి, ఎదురు సన్నాహ మహోత్సవం వంటి కార్యక్రమాలను వేద పండితుల బృందం ఎంతో అద్భుతంగా నిర్వహించింది. మైహోం గ్రూప్ అధినేత జూపూడి రామేశ్వరరావు, శ్రీకుమారి దంపతులు ముఖ్యఅతిథులుగా బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వీహెచ్ చౌదరి, గ్రామ పెద్దలు, పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



రాంబిల్లి : వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



అచ్యుతాపురం : ఎమ్మెల్యే కన్నబాబుతో గండివానిపాలెం ఉప సర్పంచ్ అచ్చియమ్మ



బుచ్చెయ్యపేట : ఎల్‌బీ పురం గ్రామస్తులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న విప్ ధర్మశ్రీ

పాయకరావుపేట: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు భారీగా పెరుగుతున్నాయి. మండలంలోని వెంకటనగరం, రాజానగరం గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వెంకటనగరం గ్రామ మాజీ సర్పంచ్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు గ్రామాలకు చెందిన కోడ చిట్టియ్య, కోడ అప్పలరాజు, గరికిన గోపి, బందు సాల్మన్, బందు గోపి, మేరుగు రాజు, మైలపల్లి ప్రసాద్, మేరుగు శ్రీను, చొక్కా కాశి, బందు బలరామ్, గరికిన దేవుడు తదితర 50 మత్స్యకార కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి మత్స్యకారులకు అభివృద్ధికి కృషి చేస్తున్నారని అందుకే వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, సకిలేటి రాము, గోసల రమణ, మేడిశెట్టి రామగోవిందు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో ..

రాంబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణ మూర్తిరాజు(కన్నబాబు)కోరారు. రాంబిల్లిలో మంగళవారం ఆయన టీడీపీకి చెందిన వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. గజిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాలకు వాసుపల్లి రాము, మైలపల్లి బంగారుశెట్టి తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించిన జగనన్నకు అండగా నిలవాలన్నారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని హితవు పలికారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేపల చిట్టిబాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన గండివానిపాలెం ఉప సర్పంచ్

అచ్యుతాపురం: మండలంలోని దోసూరు పంచాయతీ శివారు గండివానిపాలెం వైస్ సర్పంచ్ మాలిరెడ్డి అచ్చియమ్మ మంగళవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు.ఈ సందర్భంగా అచ్చియమ్మ మాట్లాడుతూ తమది వైఎస్సార్ సీపీ కుటుంబం అని,ఇటీవల దోసూరుకు చెందిన ఒక నేత పని ఉందని చెప్పి తమను జనసేన ఆఫీసు వద్దకు తీసుకువెళ్లి పార్టీ కండువా వేయించారని తెలిపారు. దీంతో చాలా ఇబ్బంది పడ్డ తాము జనసేన నుంచి మళ్లీ వైఎస్సార్ సీపీలోకి చేరడం ద్వారా సొంత గూటికి వచ్చినట్లయిందన్నారు. అచ్చియమ్మకు ఎమ్మెల్యే కన్నబాబు వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,గండి రామునాయుడు,గొర్లె ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీ పురంలో..

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురంలో 30 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కోన అప్పలనాయుడు,మొల్లి మునలినాయుడు,మొల్లి శివాజీ,పల్లా త్రిమూర్తులు,శివాజీ,బోయిన కొండయ్య,పల్లా వసంత్,కోన గుదిని,బొబ్బిలి చిరంజీవి,తుంపాన గణేష్ తదితర్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కరణం ధర్మశ్రీ విజయానికి తాము కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు. వైస్ సర్పంచ్ మెల్లి శ్రీను, గ్రామ నాయకులు పినబోయిన గంగరాజు,నంబారు అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

గొలుగొండ మండలంలో

గొలుగొండ: అమ్మపేట, గొలుగొండ పంచాయతీలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అమ్మపేట వార్డు మెంబర్ చిటికెల రమణమ్మ, రొద్దు నాగమణి, ఈగల లక్ష్మి, కాపారపు సుబ్బారావు కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గొలుగొండలో బొట్టా చంటి, కూరాకుల ప్రసాద్,బి.రామకృష్ణ, బి.సూరిబాబు, కూరాకుల రాజుబాబు తదితరుల కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

నాతవరం మండలంలో...

నర్సీపట్నం:నాతవరం మండలం గాంధీనగరానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీకిలో ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే గణేష్ చూపుతున్న ఆదరణకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ వీరందరూ వైఎస్సార్‌సీపీలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు.



గొలుగొండ : అమ్మపేటలో వార్డు మెంబర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శాంతారామ్

అనకాపల్లి: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో విజయరామరాజుపేట రైల్వే బ్రిడ్జి చెంతన విశాఖ నుంచి విజయవాడ వెళ్లే గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి(40) సోమవారం మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు. మృతుడి ఎత్తు 5 అడుగులుంటుందని, లేత నారింజ రంగు చొక్కా, బ్లాకలర్ జీన్‌ఫ్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించినట్టు ఆయన తెలిపారు. వివరాలకు 7673906010 నంబరును సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో గ్రామదేవతల ఉత్సవాలు



ముసిలితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక జాతీయ రహదారి బుద్ధగంగు నాయుడు దిబ్బవద్ద (పంటపొలాల్లో) కొలువైన ముసిలితల్లి అమ్మవారి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు భరత్ కుమార్‌ను సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యలమంచిలి పట్టణ ఎస్‌ఐపై దాడి

యలమంచిలి రూరల్: స్థానిక పట్టణ ఎస్‌ఐ కె.పాపినాయుడుపై మంగళవారం రాత్రి కొందరు యువకులు దాడి చేశారు. యలమంచిలి– అచ్యుతాపురం రహదారిలో కల్కి పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్ల సైడ్ మిర్రర్‌లు గుద్దుకున్నాయి.దీంతో కార్లలో ఉన్న యువకుల మధ్య వివాదం రాజుకుని కొట్లాటకు దారి తీసింది. యలమంచిలి రాంనగర్, రాంబిల్లి మండలం లాలంకోడూరుకు చెందిన మరికొంత మంది యువకులు ఇరువర్గాలకు మద్దతుగా అక్కడకు చేరుకుని హాకీస్టిక్స్, క్రికెట్ వికెట్‌లతో కొట్టుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి చేరుకుని రెండు వర్గాలకు చెందిన యువకులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఆగ్రహావేశాలతో ఉన్న యువకులు సివిల్ డ్రెస్‌లో ఉన్న పట్టణ ఎస్‌ఐపై దాడికి పాల్పడ్డారు.యువకులను అడ్డుకోబోయిన కానిస్టేబుళ్లపై కూడా దాడి చేయడంతో వారికి కూడా స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన పట్టణ ఎస్‌ఐ పాపినాయుడుకు యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమచికిత్స అందజేశారు. పోలీసులపై దాడి చేశామని తెలుసుకున్న యువకులు అక్కడ్నుంచి పరారయ్యారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.దాడికి పాల్పడిన వారిని గుర్తించే పనిలో ఉన్నట్టు సీఐ గఫూర్ సాక్షికి తెలిపారు.

ఘనంగా పరదేశమ్మతల్లి నెల పండుగ

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో పరదేశమ్మ తల్లి అమ్మవారి నెలపండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. టెక్కలి కుటుంబ సభ్యులంతా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా తాళ్లమ్మ పండగ

యలమంచిలి: మండలంలో పురుషోత్తపురం గ్రామ దేవత తాళ్లమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోతిరెడ్డిపాలెంలో తాళ్లమ్మ ఆలయం వద్ద భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, పసుపు,కుంకుమలు సమర్పించారు. రుక్మిణీపురం, నాయనమ్మపాలెం,కొత్తలి పేరంటాలపాలెం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద నుంచి గ్రామ వీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు.భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.సాయంత్రం నాలుగు గ్రామాల్లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.అమ్మవారి ఆలయంల వద్ద భారీగా బాణసంచా కాల్చారు.యలమంచిలి ఎస్‌ఐ సింహాచలం ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

యలమంచిలి రూరల్: న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని స్థానిక బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు ధూళి నూకరాజు, పి.వి. రమణలు చెప్పారు.మంగళవారం యలమంచిలి న్యాయస్థానాల ప్రాంగణంలో వారు మీడియాతో మాట్లాడుతూ తమపై విశ్వాసంతో గెలిపించిన న్యాయవాదులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో యలమంచిలి న్యాయవాదుల బార్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు ఎస్‌వీపీ ప్రసాద్,రాజాన గోవిందరావు,డి.ఉమాశంకర్, ఎస్.సుబ్రహ్మణ్యం, డి.వెంకటరావు,ఎల్వీ రామకష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.పలువురు న్యాయవాదులు వీరి ఎన్నికపట్ల హర్షం ప్రకటించారు.

ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ...

పత్తాలేని టీడీపీ

- ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ నేతలు
- ప్రధాన సమస్యల గుర్తించి, పరిష్కారానికి కృషి
- గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన జనంతో మమేకం
- ప్రజలకు దూరమైన టీడీపీ నేతలు
- మొక్కుబడిగా పార్టీ కార్యక్రమాలు
- ప్రజా సమస్యలు కన్నా వర్గపోరుకు ప్రాధాన్యం

నియోజకవర్గం	: అనకాపల్లి
మండలాలు	: అనకాపల్లి, కశింకోట, అనకాపల్లి పట్టణం
గ్రామ పంచాయతీలు	: 72
పట్టణంలో వార్డులు	: 5 (80 నుంచి 84వ వరకు)
గ్రామాలు	: 80
గ్రామ సచివాలయాలు	: 73

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఐదేళ్ల నుంచి ప్రజలతో మమేకమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా మారుమూల గ్రామాల్లో సైతం విస్తృతంగా పర్యటించి, ప్రజలతో మమేకమయ్యారు. వారితో అనుబంధాన్ని పెంచుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులు తెలుసుకుంటూ ప్రభుత్వం తరపున ఎంతమేర లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. అర్హత ఉండి పథకాలకు అందని వారికి మంజూరు చేయించి ప్రజల పక్షాన నిలిచారు. వారి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. ఇదే లక్ష్యంతో టీడీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ తదితర కార్యక్రమాలు ప్రచారానికే పరిమితమయ్యాయి. పార్టీ నేతలు కూడా ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిన వీరు వర్గపోరుకు ప్రాధాన్యమిచ్చారు.

అనకాపల్లి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి , మౌలిక వసతుల కల్పన వెనుక వైఎస్సార్‌సీపీ నేతల కృషి ఎంతో ఉంది. విస్తృతంగా పర్యటించి, ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను నిత్యం తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రేక్షకపాత్ర వహించగా వారి బాధ్యతలను కూడా వైఎస్సార్‌సీపీ నేతలు సమర్థంగా నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేశారు. అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయడంతో ప్రజలకు సుపరిపాలన అందుతోంది. టీడీపీ చేపట్టిన బాబూ ష్యూరిటీ...భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నియోజకవర్గంలో తూతూ మంత్రంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని పార్టీ నేతలు కలిసికట్టుగా నిర్వహించిన సందర్భాలు లేవు. గ్రూపు రాజకీయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, వర్గ పోరులో తలమునకలవడంతో ప్రజా సమస్యలు తెలుసునే తీరికే వారికి లేకుండా పోయింది. నియోజకవర్గంలోని పీలాగోవింద, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మళ్ల సురేంద్ర మూడు వర్గాలుగా విడిపోయారు. పీలాగోవింద, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్ ఇంటికే పరిమితం అయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మళ్ల సురేంద్ర తన సొంత ప్రయోజనాల కోసం పార్టీని ఉపయోగించుకున్నారు. దీంతో వీరికి సమస్యలు తెలిపేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. వైఎస్సార్‌సీపీ విషయానికొస్తే మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు కృషి చేశారు. 80 గ్రామాలు, ఐదు వార్డుల్లో పర్యటించారు. సుమారు 93 వేల గడపలను సందర్శించి, వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల నిధులతో గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.16 కోట్లతో పనులు చేపట్టారు. ఇది కాకుండా నియోజకవర్గంలో సుమారు రూ.800 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. 80శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 20శాతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ చేపట్టిన కార్యక్రమం గడప గడపకు మన ప్రభుత్వం	
సందర్శించిన గ్రామాలు	: 2,012
జీవీఎంసీ పరిధిలో	: 5వార్డులు
మమేకమైన గడపలు	: 93,000
సచివాలయం పరిధిలో కేటాయించిన నిధులు	: రూ. 16కోట్లు

టీడీపీని నమ్మని జనం

ప్రతిపక్ష టీడీపీ విషయానికొస్తే బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయింది. టీడీపీ చేపట్టిన కార్యక్రమాల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు సరికదా.. బల ప్రదర్శనకు పరిమితమయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ ఎన్నికల హామీలను ప్రజలు నమ్మడం లేదు. పొరపాటున మళ్లీ చంద్రబాబునాయుడు అధికారం చేపడితే అవ్వాతాతలు చెట్టుకిందో, గుళ్లోనో కూర్చుని, రోజులు తరబడి పింఛన్ కోసం తిరగవలసి పరిస్థితి దాపురిస్తుందని భయపడుతున్నారు.

టీడీపీలో చేపట్టిన కార్యక్రమం
బాబూ షూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ
తెలుసుకున్న సమస్యలు వర్గపోరు కారణంగా ప్రజలతో మమేకానికి దూరం
ఫలితం : మొక్కుబడిగా కార్యక్రమం
కార్యక్రమం తీరు ప్రజా సమస్యలపై పోరాడాల్సిన టీడీపీ నేతలు గ్రూపులుగా విడిపోయి, వర్గాపోరులో తలమునకలయ్యారు.

పరిష్కరించిన ప్రధాన సమస్యలు...

- సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారి వరకూ, నెహ్రూచౌక్ నుంచి గాంధీనగరం జంక్షన్ వరకూ రహదారి అభివృద్ధి, సెంటర్ లైటింగ్ ఏర్పాటు
- పట్టణ పరిధిలో రూ.4 కోట్లతో రెండు శ్మశాన వాటికల అభివృద్ధి
- రూ.59 లక్షలతో శారదానది ఒడ్డున శాంతిపార్కు నిర్మాణం
- రూ.పట్టణ పరిధిలో రూ.20 కోట్లతో చిన్నచిన్న పార్కుల అభివృద్ధి.
- రూ.కోటితో రైల్వే స్టేషన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్‌రహదారి అభివృద్ధి
- రూ.150 కోట్లతో పట్టణ పరిధిలో మొత్తం డ్రైనేజీల అభివృద్ధి
- రూ.300 కోట్లతో రోడ్లు, సీసీరోడ్ల నిర్మాణం
- జోన్ పరిధిలో రెండు శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాలు కల్పన



తుమ్మపాల పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన పార్కు, వాటర్ ట్యాంక్



తరగంపూడి ఆర్బీకే భవనం



అద్దంలా మెరిసి పోతున్న కేబీ రోడ్డు(కశింకోట, అనకాపల్లి, రావికమతం, బుచ్చియ్యపేట రహదారి)

- రూ. కోటితో ఎన్టీఆర్ క్రీడామైదానంలో మహిళా క్రీడాకారులకు డార్మింటరీ ఏర్పాటు
- రూ.12కోట్లతో ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణ సమీపంలో క్రిటికల్ కేర్ ఆస్పత్రి నిర్మాణం

అనకాపల్లి మండలంలో..

- ప్రతి గ్రామాన్ని జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రహదారులను అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, అవసరమైన గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
- అక్కిరెడ్డిపాలెం పంచాయతీ పరిధి గణేష్‌నగర్ నుంచి జాతీయ రహదారిపై మారేడుపూడి రోడ్డు వరకూ రూ.2కోట్లతో అభివృద్ధి.
- రూ.32కోట్లతో కేబీ రోడ్డు అభివృద్ధి చేసి కశింకోట, అనకాపల్లి, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల వాహనదారులకు, ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించారు.
- రూ.7.5కోట్లతో మండలంలో శంకరం పంచాయతీ పరిధిలో బొజ్జనకొండ వద్ద అభివృద్ధి పనులు.రూ.3 కోట్లతో రహదారి విస్తరణ

కశింకోట మండలంలో....

- జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామీణ రహదారుల అభివృద్ధి. ఆ రోడ్ల నుంచి కశింకోట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని కలుపుతూ రోడ్ల నిర్మాణం.
- మండలంలో ప్రధాన కూడళ్లతో పాటు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు.
- కమ్యూనిటీ హాళ్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు సుమారు రూ. 150 కోట్లతో చేపట్టారు. వెదురుపర్తి – కశింకోట బ్రిడ్జి శారదానదిపై నిర్మించారు.

ముమ్మరంగా ప్రచారం



గోకివాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గణపర్తిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సర్పంచ్ నాయుడు



అరబుపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కశింకోట భవాని కాలనీలో వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు



వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత, వేదికపై కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి



నాగవంశం వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జాజుల రమేష్

రాంబిల్లి: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా చేస్తున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి. సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. గోకివాడలో ఎస్.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.సిరసపల్లి రామారావు, ద్వారపురెడ్డి గోవిందరావు, నందవరపు రాఘవరావు పాల్గొన్నారు.

మునగపాక: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు ముమ్మరంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ,యలమంచిలి ఎమ్మెల్యేలుగా బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను గెలిపించాలని కోరుతూ గణపర్తిలో సర్పంచ్ చదరం నాయుడు ప్రచారం చేశారు. అలాగే అరబుపాలెంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జిలతో పాటు పార్టీ శ్రేణులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

కశింకోట: కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, ఈ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అన్నారు. కశింకోటలోని రౌతువీధి, వెదురుపర్తి గ్రామంలో సోమవారం రాత్రి, కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో మంగళవారం బూత్ కమిటీల వారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కశింకోటలో ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు గత ఐదేళ్లలో నిర్మించామన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మల సాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా భవానీ కాలనీకి చెందిన సుమారు 40 మంది యువకులు టీడీపీ పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు.

అనకాపల్లిలో

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, మరిన్ని సంక్షేమ పథకాలను అందుకోవాలని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత తెలిపారు. స్థానిక 83వ వార్డులో మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫ్యాన్‌గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని వారు కోరారు. 83వ వార్డు పరిధిలో పెద్దవీధి, లోకావారివీధి, నాగవంశంవీధిలో వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నాయకులు దొడ్డి హేమవెంకట నాగజగన్, సాయి, కాంగ్రెడుల బలరామ్, అశోక్, మళ్ళ శివాజీ, దొడ్డి చిన్నారి, బాలు,కారుకుండి కన్నాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి ఖుష్బూ ప్రచారం

కశింకోట: దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని మోదీకి అండగా నిలవాలని బీజేపీ జాతీయ కార్యదర్శి, సినీ నటి ఖుష్బూ అన్నారు. మంగళవారం పార్టీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారానికి ఆమె కశింకోట వచ్చారు. ప్రచారరథంపై రోడ్‌షో నిర్వహించారు. 2047 నాటికి స్వతంత్ర భారతం 100 సంవత్సరాలు పూర్తి చేసుకునే సందర్భంగా భారత దేశం అన్నింటా ముందు ఉండాలని భావితరాల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటి నుండే ఆలోచిస్తున్నారన్నారు.

ప్రచార ఖర్చు రూ40 లక్షలే..



పోటీలో ఉన్న అభ్యర్థులు,రాజకీయపార్టీల ప్రతినిధులకు ఎన్నికల ఖర్చుల వివరాలు తెలియజేస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచార ఖర్చు రూ.40 లక్షలు మించరాదని రిటర్నింగ్ అధికారి కె.మనోరమ సూచించారు. యలమంచిలి అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న వివిధ రాజకీయపార్టీల అభ్యర్థులు, వారి ప్రతినిధులతో యలమంచిలి ఆర్వో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చుకు సంబంధించిన వివరాలు, నమోదు చేయాల్సిన పద్ధతి తదితర విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో ఉన్న 10 మంది అభ్యర్థుల పేర్లు,వారికి కేటాయించిన గుర్తులను అన్ని రాజకీయపక్షాల ప్రతినిధుల సమక్షంలో తెలియజేశారు. ఈ సమావేశంలో ఏఆర్వో అప్పలరాజు, ఎన్నికల విభాగం డీటీ బాలేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కస్పా రవికుమార్,పలు రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు	వైఎస్సార్‌సీపీ	సీలింగ్ ఫ్యాన్
అనంతరామ నర్సింగరావు	కాంగ్రెస్	హస్తం
లంబ శ్రీనివాసరావు	బీఎస్పీ	ఏనుగు
బి.అమ్మాజమ్మ	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
అర్జున్ కుమార్ సుందరపు	నవరంగ్ కాంగ్రెస్	బక్కెట్
దూది పూర్ణ చంద్రరావు	జై భారత్ నేషనల్	బ్యాటరీ టార్చి
బోజా నాగేశ్వరరావు	రీఫారమ్స్ పార్టీ ఆఫ్ ఇండియా	కరెంటు స్తంభం
సుందరపు విజయ్ కుమార్	జనసేన	గాజు గ్లాసు
ప్రగడ అన్నపూర్ణ	స్వతంత్ర	బైస్కిల్‌పంపు
మొల్లేటి రమేష్	స్వతంత్ర	గ్యాస్ సిలిండర్

అనకాపల్లి నియోజకవర్గంలో

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 12మంది ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జేసీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.జాహ్నవి అభ్యర్థులకు మంగళవారం గుర్తులను కేటాయించారు.

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
మలసాల భరత్‌కుమార్	వైఎస్సార్‌సీపీ	సీలింగ్ ఫ్యాన్
ఐ.ఆర్.గంగాధర్	కాంగ్రెస్	హస్తం
సూదికొండ మాణిక్యాలరావు	బీఎస్పీ	ఏనుగు
పొలమరశెట్టి అంబికాదేవి,	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
ఒమ్మి వెంకట్ యాదవ్	సమాజ్‌వాది పార్టీ	బైస్కిల్ పంపు
కనిశెట్టి సురేష్‌బాబు	జై భారత్ నేషనల్	బ్యాటరీ టార్చ్
కొణతాల రామకృష్ణ	జనసేన	గాజు గ్లాస్
తోట వెంకట సాయి ముకుంద్	ప్రజాప్రస్థానం	మనిషి తెరచాపతో పడవ
దొమ్మెసి అప్పారావు	రిపబ్లిక్ పార్టీఆఫ్ ఇండియా	ఎయిర్ కండీషనర్
ఎస్. వి.వి.రామచంద్రరావు	ప్రేమ్ జనతాదళ్	లైటర్
అల్ల సత్తిబాబు	ఇండిపెండెంట్	కత్తెర
కాపారపు సత్యనారాయణ	ఇండిపెండెంట్	మైక్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: పరవాడ 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతు పనుల కారణంగా బుధవారం యలమంచిలి మండలంలోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు, ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.మిగతా సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

కొత్తూరు సెక్షన్ పరిధిలో...

అనకాపల్లి: మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తూరు విద్యుత్ సెక్షన్ పరిధిలో కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, వేటజంగాలపాలెం, కుంచంగి కూండ్రం, విసన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయంతో అవస్థలు

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ అంతరాయం కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులకు ఈ విషయమై పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీ వాసులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మంచి చేశాం... మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు

మునగపాక: గత ఐదేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేశాం.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కోరారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని తెలిపారు. నవరత్నాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా ప్రజలకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు జగన్‌మోహన్ రెడ్డేనని చెప్పారు.

అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును, యలమంచిలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు,మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.